

వివరాలు మెయిన్‌లో

అందరి సహకారంతో నల్లగొండ జిల్లాను సమగ్ర అభివృద్ధికి కృషి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
గురువారం | 03 జూలై , 2025 | పేజీలు : 06

## నల్లగొండ జిల్లాలో మోస్తరు వర్షాలు..

# మొలకెత్తిన ఆశలు

### జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు..
### తగ్గిన వ్యవసాయ సాగు..
### వాన కోసం రైతుల ఎదురుచూపులు..
### గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఊరట చెందిన రైతులు



**ప్రజాపక్షం/ నల్లగొండ ప్రతినిధి:** పత్తి సాగు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తుంది. రెండు మూడు రోజులుగా జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పత్తి విత్తనాలు మొలకె త్తుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ముందస్తుగా కురిసిన వర్షాలతో రైతులు సంబరపడి పత్తి విత్తనాలు విత్తారు. కానీ ఆ తర్వాత సూర్యుడు నిప్పులు కక్కుతుండడంతో రైతులు ఆవే దనకు గురయ్యారు. గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న మోస్తారు వర్షం పంటలకు జీవం పోస్తున్నది. వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభ మైనప్పటికీ ఈ సీజన్లో వర్షాలు అడపదడప కురిశాయి. రైతులు ఆశించిన వర్షాలు మాత్రం కురువలేదు. కొన్ని ప్రాంతాల్లో రైతులు జూన్ మొదటి వారంలో కురిసిన చిన్నపాటి వర్షాలకు విత్తనాలు వేశారు. రైతులు విత్తనాలు వేసిన నాటి నుండి ఇప్పటివరకు వర్షాలు కురి యుక పోవడంతో రైతులు ఆందో ళన చెందుతున్న తరు ణంలో గత రెండు రోజులుగా నల్లగొండ జిల్లాలోని పలు చోట్లలో వర్షాలు కురిశాయి. దీంతో రైతులు కొంత ఊరట చెందారు. ఈ సంవత్సరం లో వ్యవసాయ సాగు కొంతమేరకు తగ్గిందని అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురవక పోవడంతో ఆశించిన మే ర పంటల సాగు కనిపించడం లేదు. జూన్ నెలల్ సాధారణం కంటే 18 శాతం తక్కు వగా జిల్లాలో వర్షపాతం నమో దయింది. రుతుపవనాలు ముందే తాకినా జూన్ నెలలో వర్షాలు ఆశాజనకంగా కురి యలేదు. వర్షాధారం కింద ప్రస్తుత సీజన్లో భారీగా వరితో పాటు ఇతర పంటలు సాగు చేస్తారు. జిల్లాలో వర్షం రైతులు ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పడ లేదు. జూన్ మాసం అన్నదాతలకు ఎలాంటి మేలు చేయకుండానే వెళ్లిపో యింది. జూన్ 29, 30, జూలై రెండు వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురి యడంతో పత్తి విత్తనాలు వేసిన రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రస్తుత సీజన్లో లో జి ల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు సగటున 130.2 మిల్లీ మీటర్లు ఉండాల్సి ఉండగా 95.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జూన్ మొత్తంలో 7 రోజులే వర్షపాతం నమోదయింది. ఇది సాధారణకంటే 67 శాతం అధికం. గత ఏడు 15 రోజులు వర్షాలు కురిశాయి. జిల్లాలో 33 మండ లాలు ఉండగా 15 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదయింది. జూన్ నెలలో కొన్ని మండ లాల్లో మాత్రమే సాధారణ వప్షాతం నమోదయింది. జూన్ నెలలో సాధా రణ వర్షపాతం నమోదు కాలే దు. జూన్ నెలలో జిల్లా సాధారణ వర్ష పాతం 129.5 మిల్లీ మీటర్లు కాగా 84.5 మి ల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. ఇది సాధారణంకంటే 33 శాతం కంటే తక్కువ. ఇదే సీజన్లో గత సంవత్సరం జూన్ నెలలో సాధా రణం కంటే ఎక్కువ 165.8 మిల్లీ మీ టర్ల వర్ష పాతం నమోదయింది. జిల్లా లో సాధా రణం కంటే 50 శాతం నమోద యింది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో

# అవినీతిని సహించేది లేదు

### కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవినీతిని సహించేది లేదని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉత్తటూర్ గ్రామంలో నిర్మా ణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మా ణంలో రాష్ట్రంలోనే యాదాద్రి భువనగిరి జిల్లా రెండవ స్తానంలో ఉందన్నారు. లబ్దిదా రులకు ఇంటి నిర్మాణ పనుల్లో ఇబ్బందులు కలుగ కుండా మండల స్తాయిలో ఎంపీ డీవో, తహసీల్దార్, ఎస్ఐలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మార్కెట్ ధర కన్నా తక్కువ ధరలకు సిమెంట్, ఇటుక, సీకు, ఇతర వస్తువు లను ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఇబ్బందులు లేకుండా పనులు అయ్యే కొద్ది ప్రతి సోమవారం ఖాతాల్లో డబ్బులు జమా అవుతా యని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి విడుతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతా యని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో యాకుబ్‌నాయక్, తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీవో, పీఆర్ ఏఈ గాలయ్యలు ఉన్నారు.



# బాలకార్మికుడికి విముక్తి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని కొత్తపేట తండాకు చెందిన ధనావత్ బాలునాయక్ బాల కార్మికు డిని పనిలో పెట్టుకోని బుధవారం బాలుడి చేత పిల్లర్ గుంతలు తీయిస్తుండగా ఆపరేషన్ ముస్కాన్ టీం 11 ఇన్ చార్జి బనావత్ శ్రీనివాస్ ముస్కాన్ టీం సబ్యులతో కలిసి బాల కార్మికుడిని పని నుంచి విముక్తి కలిగించారు. పనిలో పెట్టుకున్న ధనావత్ బాబుపై చట్టరిత్యా చర్య గురించి దర ఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ లక్ష్మ య్య తెలిపారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఎం.ప్రసాద్, ఎం.సైదులు, సీహెచ్.పసైదులు, నీలా, జూని యర్ అసిస్టెంట్ పాషా, రాము, ఆశ్రిత, కవితలు ఉన్నారు.

# ఫిట్‌నెస్‌లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాపక్షం/చింతపల్లి : విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఫిట్‌నెస్‌లేని వాహనాల ద్వారా విద్యార్థులను తరలిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంషోద్దిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు అను మతులు లేని ఫిట్‌నెస్‌ని వాహనాలు నడిపి విద్యార్థుల జీవితాలను గాల్లో దీపంలా మార్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర మండలాల నుండి ప్రైవేటే పాఠశాలల వాహనాలు అనుమతులు లేకుండా చింతపల్లి మండలంలో నడుస్తున్నాయన్నారు. నాగార్జున పాఠశాలతో పాటు ఇతర పాఠశాలల ఫిట్‌నెస్‌లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి అంజయ్యకు బుధవారం వారు వినతి పత్రం అందించారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అను మతులు లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని పాలావరం ఆవాస గ్రామమైన రంగయ్యగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆశాజ్యోతి పౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో త్రిపురవరం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దొంగరి లక్ష్మి నర్సయ్య విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాజ్యోతి స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పేద విద్యార్థులకు విద్యకు ఉపయోగపడే బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామినేని సతీష్, ఉపాధ్యాయులు గోపతి ఉపేందర్, సిఆర్‌పిలు ఉపేందర్, వెంకటరమణ పాల్గొన్నారు.

## సుధాబ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/కోదాడ:** సుధా బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. బుధవారం కోదాడ శాఖ ఆవరణలో ఏర్పాటు చేసిన రుణమేళ కార్యక్రమాన్ని బ్యాంకు అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఖాతాదారులు సంక్షేమం కోసం తక్కువ వడ్డీకి అనేక రుణ పథకాలు అందిస్తున్నామని ఓపెన్ ప్లాట్లు అపార్ట్‌మెంట్‌లు ఇంటి విస్తరణకు విద్యా, వ్యాపార, గృహ, బంగారు, వాహన రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, గిడ్డంగి సర్టిఫికెట్లు రుణాలతో పాటు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించుకుని ఉపాధి మార్గాలను పొంది ఆర్థికంగా స్థిరపడాలని అన్నారు. సుధాబ్యాంక్ తక్కు వ వడ్డికే అందిస్తున్న రుణాలను కోదాడ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంకు కోదాడ మేనేజర్ చెన్నూరి రవికుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** వర్షాకాలంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రయాణ సమయంలో వాహనదారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాల బారిన పడకుండా గమ్యం చేరుకోవాలని అన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు విద్యుత్ తీగలు, స్థంబాల నుండి దూరంగా ఉండాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న కాలువలు నదులలోకి చేపలు పట్టడానికి వెళ్లకూడదని, విద్యార్థులు రవాణా చేసే వాహనాలను డ్రైవర్స్ జాగ్రత్తగా నడాపాలని సూచించారు. రోడ్లపై అధికవేగంతో వాహనాలు నడపవద్దని కోరారు. అత్యవసర సమయంలో పోలీస్ సేవలు పొందడానికి డయల్ 100 లేదా, సూర్యాపేట జిల్లా పోలీస్ కంట్రోల్ 87126 86026 ఫోన్‌చేసి సహాయం పొందవచ్చునన్నారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల సమయంలో పరిస్థితులు అంచానవేస్తూ అవగాహన కల్పించాలని అన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి




**ప్రజాపక్షం/అనంతగిరి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న నేటికి పెండింగ్‌లో ఉన్న ఫీజురియంబర్స్ మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వహిస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డివిజన్ కార్యదర్శి పులి రాఖీ అన్నారు. బుధవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో అనంతగిరి మండల పరిధిలోని ఇంజనీరింగ్, ఫార్మసి కాలేజీలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులి రాఖీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి మేనిపెస్టోలో విద్యార్థులకు న్యాయం చేస్తానని చెప్పి పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేస్తామని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి నేటికి 18 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు రావాల్సిన 7200 కోట్ల రూపాయలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించడం అంటే పేద విద్యార్థుల పట్ల ఏ విధమైన ప్రేమ ఉందో అర్థ అవుతుందని వారన్నారు. విద్యార్థులు ఫీజురియంబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఆర్థం కావడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, నాయకులు ఉమేష్, రమ్య, సాహితి, సులోచన, మంజుల పాల్గొన్నారు.

## సుధాబ్యాంకు రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సుధాబ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుణమేళాను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుధా బ్యాంకు ఎండి పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంకు వద్ద నిర్వహిస్తున్న రుణమేళాలో పాల్గొని మాట్లాడారు. సుధా బ్యాంకు ఆధ్వర్యంలో 16 రకాల రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ రుణమేళాలో వివిధ రకాల రుణాలను సులభంగా పొందేందుకు బ్యాంకు మేనేజర్, సిబ్బందిని కలిస్తే వారి అవసరాల మేరకు కాలయాపన చేయకుండా రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. రుణాల కోసం వివిధ బ్యాంకులకు వెళితే అప్లికేషన్ తీసుకొని పలు రకాల కారణాలతో నెలల తరబడి తిప్పుతున్న సందర్భంలో స్థానికంగా ఉన్న సుధా బ్యాంకు ప్రజల అవసరాలనపు తీర్చేందుకు ప్రజలతో సత్సంభందాలు ఉండటంతో వారంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. అత్యవసరమైతే రెండు, మూడు రోజుల్లో రుణాల మంజూరుకు సహకరిస్తామన్నారు. ఇంటి మరమ్మతులకు విస్తరణకు, చిరు వ్యాపారాలకు, దుకాణదారులకు చేతి పని వృత్తిదారులకు 12 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ పతాని సైదులు, ఫీల్డ్ ఆఫీసర్ మేకల కేశవులు, సిబ్బంది మారినేని నవీన్,ప్రజలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో సుమారు రూ.700కోట్లతో నిర్మించే మలబార్ గోల్డ్ పరిశ్రమ ఏర్పాటును ప్రభుత్వం మద్దతును ఉపసంహరించకోవాలని స్వర్ణకార సంఘం జిల్లా ఉపాద్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరచారి బుధవారం అన్నారు. చేతివృత్తులకు చేయూతనందించాల్సిన ప్రభుత్వాలు కార్పోరేట్ వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటూ తరతరాలుగా కుల వృత్తులను నమ్ముకున్న స్వర్ణకారుల బతుకులను చిన్నాబిన్నం చేసే ఇలాంటి నిర్ణయాల వల్ల స్వర్ణకార వృత్తిదారులు ఇంకా పనులు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఓవైపు కార్పోరేట్ జ్యూవెలరి షాపుల మూలంగా వృత్తులు కోల్పోయి తమ స్వర్ణకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఓవైపు పెరుగుతున్న బంగారం ధరల మూలంగా పనులు లేక ఇప్పటికే అనేక మంది స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో ప్రభుత్వం ఇలాంటి చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రభుత్వాలు స్వర్ణకార వృత్తిదారులకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో శ్రీరామోజు నరసింహాచారి, చొల్లేటి చంద్రశేఖర్‌చారి, మారోజు రాఘవచారి, శుభకోటి శశి, కృష్ణమాచారి పాల్గొన్నారు.

# ఆందోల్ మైసమ్మ హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామ శివారులోని శ్రీ శ్రీ శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయ హుండీ లెక్కింపును బుధవారం దేవాధాయ ధర్మాధాయ పరిశీలకులు, పోలిసుల సమక్షంలో దేవాలయ కార్యనిర్వహణ అధికారి సాల్వాది మోహన్ బాబు ఆధ్వర్యంలో ఆలయ హుండీ విప్పి లెక్కించారు. 105 రోజులకు భక్తులు కానుకల రూపంలో సమర్పించిన రూ.10,94,990 లుగా లెక్కించ్చినట్లు దేవస్థాన కార్యనిర్వాహణ అధికారి మోహన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కె.భాస్కర్, ఆలయ చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి, ధర్మకర్తలు బుర్ర స్వామీ గౌడ్, కంచర్ల ప్రవీణ్ రెడ్డి, అత్తపురం అంజిరెడ్డి, గుండ్ల అశోక్, చింతంపల్లి జంగయ్య, ఎల్లంకి రమేష్ చారి, ఎద్దుల పరమేష్, చేపూరి మహేష్, పబ్బు కిరణ్ గౌడ్, శ్రీమతి సంఘం యాదమ్మ, మల్లేష్, అర్చకులు శివ ప్రసాద్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ ఏ.సత్తి రెడ్డి, భక్తులు పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.





## అర్హులకు సంక్షేమ పథకాలు

**ప్రజాపక్షం/మునగాల:** అర్హులైన లబ్ధిదారులందరూ సంక్షేమ పథకాలు అందుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కలకోవ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంను ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు సౌకర్యవంతంగా అధికారులు పనిచేయడం జరుగుతుందని చెప్పారు. గృహజ్యోతి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను దరఖాస్తు, ఇందిరమ్మ ఇండ్లకు కట్టుకునే వారికి రెండవదప అవకాశం ప్రభుత్వమే కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక జిల్లా టీమ్ లీడర్ పల్లెల లక్ష్మ ణ్, పాలకుర్తి శ్రీకాంత్, పల్లెల రాము, గంట బిక్షాపతి, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, కందమళ్ల నాగలక్ష్మి , గజ్జి మంజుల పాల్గొన్నారు.

## వాకింగ్ వెళ్తూ అనంతలోకాలకు



**ప్రజాపక్షం/కోదాడ:** వాకింగ్ వెళ్తూ ఉదయాన్నే వెళ్లి ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాల వెనుక నివాసం ఉంటున్న షేక్ సల్మాన్ (23) ప్రతిరోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఉత్తమ్ పద్మావతినగర్‌లో ఎదురుగా సర్వీస్‌రోడ్డు వెంబడి వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కిడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు పట్టణంలోని రెడిమెడ్ వస్త్రదుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న కోదాడ పట్టణ పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## డబ్బాకొట్లు తొలగించవద్దంటూ ఆందోళన

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం చుట్టు ఉన్న డబ్బాకొట్లు, మండపం ఏరియాలోని ఉన్న డబ్బాకొట్లను తొలగించి తమను రోడ్డున పడవేయవద్దని చిరువ్యాపారులు మున్సిపల్ కార్యాలయం ముందు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారస్తులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా చిన్న, చిన్న డబ్బాకొట్లు ఏర్పాటు చేసుకుని కుట్టుమిషన్లు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నామని ఇప్పటికప్పుడు తమను ఖాళీ చేస్తే తాము ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ రాతపూర్వకంగా నూతనంగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లో తమకు షాపులుకు కేటాయిస్తామని హామీ ఇస్తే సహకరించి ఖాళీ చేస్తామన్నారు. లేని పక్షాన బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తే అందరం కలిసి అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.





## తాపీ మేస్త్రీలతో సమావేశం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో యాకుబ్‌నాయక్ తాపీ మేస్త్రీలతో, సంబంధిత యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రి, ఇసుక, ఇటుక, రాయి, కంకర, సిమెంట్, ఐరన్ మొదలైన వాటి ధరలను మండల స్థాయిలో మండల కమిటీచే నిర్ణయించారు. ఇందిరమ్మ ఇండ్లను 400 నంచి 600 స్క్వేర్ ఫీట్లతో ఇంటి నిర్మాణానికి పేదలకు సరసమైన ధరలను నిర్ణయించి ఆమోదించారు. తహసీల్దార్, ఎంపీవో, ఎపిఒ మల్లయ్య, పీఆర్ ఏఈ గాలయ్య, హౌసింగ్ ఏఏఈ సురేష్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరి శ్రీనివాస్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోని ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి వెళ్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మన్ బుధవారం రామన్నపేటలో ఆగడంతో మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి.జమీరొద్దీన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జింకల ప్రభాకర్, గోదాసు పృధ్వీరాజ్, వనం చంద్రశేఖర్, ఎండి.రేహాన్, ఎండి.నాసర్, జిల్లా వెంకటేష్, సాల్వేరు లింగం, కోట సుధాకర్, గురజాల అంజిరెడ్డి, ప్రవీణ్, బొడ్డు నరేందర్, గోదాసు శ్రీమన్నారాయణ, కేశవదాస్ వెంకటేష్, కొత్తపల్లి అబ్రహంకుమార్, లవణం సాయి, రాపోలు ఉపేందర్ ఉన్నారు.

## ఉద్యోగ విరమణ సన్మానం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్ మండల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన యాదవ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జయశ్రీ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డివిజన్ ఏసీపీ పటోళ్ళ మధుసూదన్ రెడ్డి పాల్గొని యాదవరెడ్డి దంపతులను పూలమాలలు శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతు శాంతి బాధ్రతల పరిరక్షణ సమయంలో కఠినంగా వ్యవహరిస్తూ కుటుంబాలకు బంధాలకు, బంధుత్వాలకు దురంగా ఉంటూ ఎక్కువ సమయం పోలీసు విధులు నిర్వహించడం తోనే గడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్, రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ రాములు, ఎస్సై యాదగిరి, రామన్న పేట ఎస్సై మల్లయ్య, నారాయణ పురం ఎస్సై జగన్ తదితర పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గ్రామ శాఖ అధ్యక్షులు బోయ శ్రవణ్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని మాట్లాడారు. పేరు పక్కన మాదిగ అని రాసి మాదిగ లతో పాటు సబ్బండ పీడిత కులాల ఆత్మగౌరవ పతాక గా నిలిచిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాలు గా ఎస్సీ రిజర్వేషన్ లను జనాభా ప్రాతిపధికన పంచాలని ఉద్యమించి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కు చట్టభద్ధత సాధించి కోట్లాది మాదిగల, ఉపకులాల జీవితాల్లో వెలుగులు ఇచ్చే గొప్ప భవిష్యత్‌ను ప్రసాధించాడని అన్నారు. వర్గీకరణ కోసం ఉద్యమిస్తూనే ఆరోగ్యశ్రీ సాధనలో, పెన్షన్ పెంపు పోరాటాల్లో, సబ్బండ కులాల కు హక్కుల సాధన పోరాటాలకు దిక్సుచిగా నిలిచాడని భారత ప్రభుత్వం కృష్ణ మాదిగ చేసిన



పోరాటాన్ని గుర్తించి పద్మశ్రీ అవార్డు తో సత్కరించిందని అన్నారు. అలాగే ఈనెల 7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, అలాగే పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా ప్రతి మాదిగ పల్లెలో పండుగ వాతావరణ లాగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, బోయ సంపత్, బోయ అరవింద్, తూర్పింటి వంశీ, బోయ వంశీ, అఖిల్, ప్రకాష్, బోయ సృజన్, ఆకాష్, బర్రం అభిలాష్, బర్రె సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎమ్ఎమ్ఎస్‌టిఇను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో చెత్తను ఏరుకునే వారు నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైస్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యంలో స్వచ్ఛంద భాగస్వాములుగా ఉన్న సుమారు 200 మంది ఈ పథకంలో లబ్ది పొందాలని కోరారు. మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్, పథకం నోడల్ ఆఫీసర్ శ్వేత మాట్లాడుతూ ఈ పథకం కింద చెత్తను ఏరుకునే వారు, నిరుపయోగ కార్డన్లు, స్రాప్ కొనుగోలు చేసేవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఈ పథకం కింద పావలా వడ్డీకి రూ.5లక్షల వరకు రుణ సౌకర్యం, ఆయుష్మాన్‌భారత్ కింద రూ.5లక్షల వరకు వైద్యానికి, రూ60 ఏండ్లు పూర్తి చేసుకున్న వృద్ధులకు పెన్షన్ సౌకర్యం ఉంటుందని, అదేవిధంగా పిల్లలకు విద్యా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నవజీవన్ రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లు మారుతి ప్రసాద్, పి.లక్ష్మీ కాంతమ్మ రెవెన్యూ ఆఫీసర్ జ్ఞానేశ్వరి, శానిటరి ఇన్స్పెక్టర్ వెంకటరమణ, మెప్మా సీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సిగాచి కంపెనీ ప్రమాదంపై ప్రధానిది మొసలి కన్నీరు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ రాష్ట్రంలో సిగాచి కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారికి రెండు లక్షల నష్టపరిహారం ప్రకటించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మొసలి కన్నీరు కారుస్తున్నారని దేశంలో అనేక సంఘటనలు జరిగితే పట్టించుకోని ప్రధాని సిగాచీ కంపెనీ ప్రమాదంపై స్పందించడం తెలంగాణ రాష్ట్ర రాజకీయ ప్రయోజనం కోసమేనని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్లో మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాల కారణంగానే నేడు సిగాచి కంపెనీ బాధితులకు భరోసా లేకుండా పోయిందన్నారు. యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ చట్టాలను రద్దుచేసి రెండు లక్షల నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో 46 మంది శవాలు మాత్రమే దొరికాయని ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ కంపెనీ ఎండి ఇప్పటివరకు స్పందించకపోవడం సరికాదన్నారు. సంఘటన జరిగిన తర్వాత రాష్ట్ర మంత్రులు, సీఎం సంఘటన స్థలాన్ని పరిశీలించి కోటి రూపాయల ఆర్థిక సాయం యాజమాన్యం మాత్రమే చెల్లిస్తుందని చెప్పటం హాస్యాస్పదమన్నారు. మూసీ నది నీటిని శుద్ధి చేయాలని అన్నారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయంగా గోదావరి, కృష్ణ జలాలు అందించాలని సూచించారు. బస్వాపురం ప్రాజెక్టు తక్షణం నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని, గంధమల్ల ప్రాజెక్టులను పనులు వేగవంతం చేయాలని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కూడా నిధులు కేటాయించి పూర్తిచేసి లిఫ్ట్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్ వంటి మండలాలకు కృష్ణా జలాలు అందేలా ప్రభుత్వము బాధ్యత తీసుకోవాలని వీరయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, పాండు, జల్లెల పెంటయ్య పాల్గొన్నారు.






## ఉత్తమ వైద్యురాలికి సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వహీదాబేగంను డాక్టర్స్‌డేను పురస్కరించుకొని బుధవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రునాయక్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో వైద్యులను మించిన వారెవరూ లేరని, వైద్యులు దైవ సమానులని అన్నారు. మాత శిశు సేవలను అందించడంలో మిర్యాలగూడ డివిజన్ నంచి ఉత్తమ వైద్యురాలిగా గైనకాలజిస్ట్ విభాగం నుంచి డాక్టర్ వహీదాబేగం ఎంపిక కావడం జరిగింది. కార్యక్రమంలో సామాజికవేత్త, జనయేత్రిఫౌండేషన్ చైర్మన్ మునీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

## కొండాపురం పాఠశాలకు కోతుల బెడద

**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని ఎంపీ యుపిఎస్ కొండాపురం పాఠశాలలో ఈ మధ్యకాలంలో పోతుల బెడదతో విద్యార్థులు, ఉపాధ్యాయులం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటు



న్నామని ,కోతుల బెడద నుండి మమ్ములను కాపాడాలని ఎంపీ యుపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూతం ముత్యాలు సంబంధిత అధికారులకు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు చదువుకునే సమయంలో ,మధ్యాహ్న భోజనం చేసే సమయంలో వెంటపడుతుతున్నాయని అన్నారు. ఇట్టి విషయంపై గ్రామ పంచాయితీ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే మేము ఏమి చేయలేము అని సమాధానం ఇచ్చారని అన్నారు. విద్యార్థులకు ప్రాణ హాని కలుగకుండా కోతుల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించినట్లు పాఠశాల హెచ్ ఎం భూతం ముత్యాలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** 2025 పదవ తరగతి ఫలితాల్లో మండల ర్యాంకు సాధించిన బొమ్మ జతీన్‌కు బుధవారం తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండి రియాజ్ రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్ సమక్షంలో ఉన్నత చదువులకు అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాగా కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగం సంకలన సంక్షిప్త సమాచారం పుస్తకాన్ని అర్బన్ బ్యాంక్ కొంగరి భాస్కర్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్ ఏలే హరిశంకర్, సీఈవో సీత శ్రీనివాస్, నిజం కాలేజ్ ప్రొఫెసర్ తడక యాదగిరి, వంగూరి పాండు, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

## మిత్రురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** 1996/97 పదవతరగతి చదివిన గజరాజు నిర్మల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి పూర్వ విద్యార్థి మిత్రులంతా కలిసి వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా కూతురు పేరు మీద 60000 ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు విష్ణు, తుమ్మల భాస్కర్ రెడ్డి, గజరాజు కాశీనాథ్, కోరె బీరప్ప, నాగం సత్తిరెడ్డి పాల్గొన్నారు.



# అడ్లూరికి ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే వీరేశం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే సమీక్ష సమావేశమునకు విచ్చేస్తున్న నల్లగొండ జిల్లా ఇంచార్జి , ఎస్సీ,ఎస్టీ,మైనారిటి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కు స్థానిక శాసనసభ్యుడు వేముల వీరేశం నార్కట్‌పల్లిలోని వివేరా హోటల్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఆయనతో పాటుగా విచ్చేసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య కు కూడా ఎమ్మెల్యే వీరేశం ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో మాజి జడ్‌పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, పట్టణ అధ్యక్షుడు జెర్రిపోతుల భరత్ గౌడ్, నాయకులు ,మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ యాదయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, రాదారపు బిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నార్కట్‌పల్లి కి విచ్చేసిన మంత్రిఅడ్లూరికి ఘనస్వాగతం పలికిన నేతలు

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మైనార్టీ దివ్యాంగుల సంక్షేమ శాఖ , నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. సత్కరించిన వారిలో చెర్వుగట్టు మాజీ డైరెక్టర్ గడ్డం పశుపతి, ఉగాపెల్లి ఆంజనేయులు, గడ్డగూటి యాదగిరి, గట్టిగల్ల వెంకన్న , మేడ బోయిన ఐలయ్య, కొత్తపేట స్వామి పాల్గొన్నారు.

# నేతాజీ యువజన మండలి అధ్యక్షుడిగా మురళీకృష్ణ



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** నేతాజీ యువజన మండలి అధ్యక్షులుగా దొంతరబోయిన మురళీ కృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం నేతాజి యువజన మండలి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొంతరబోయిన మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యాస మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుండెగాని కిరణ్, గడ్డం సతీష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు యాస లక్ష్మారెడ్డి, జెన్నాయికోడే నగేష్, జిల్లాల శేఖర్ రెడ్డి, బీసు చందర్ గౌడ్, నోముల వెంకట్ రెడ్డి, గజరాజు కాశీనాథ్, బొబ్బల ఇంద్రారెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, బండారి సత్యనారాయణ, ఎలగందుల శ్రీనివాస్, నేతాజీ యువజన మండలి మాజీ అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్, పోతగాని మల్లేష్, దొంతరబోయిన భాస్కర్, ప్రతికంఠం శంతన్ రాజు తదితరులు పాల్గొన్నారు

# ఉప్ప రంగమ్మ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** స్వాతంత్ర్య సమర యోధురాలు ఉప్ప రంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం మండల పరిధిలోని రామారం గ్రామంలో ఆమె చిత్రపటానికి మాజీ మంత్రి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు ధారావత్ వెంకన్న, వెంకన్న, ఉపేందర్, వెంకటయ్య పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్న బిసి ఉద్యమానికి ముదిరాజుల సంపూర్ణ మద్దతు



**ప్రజపక్షం/చౌటుప్పల్ :** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపడుతున్న బిసి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ముదిరాజుల సంఘం అధ్యక్షులు గట్టు వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బిసి పొలిటికల్ జెపిసి కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ సుధగాని హరిశంకర్ గౌడ్‌లను హైదరాబాదులోని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి మల్లన్న చేపడుతున్న బిసి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రానున్నది బిసి రాజ్యం అని 2028 ఎన్నికల్లో బిసి ముఖ్యమంత్రి అవడం ఖాయమని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలు అంత కలిసి కట్టుగా పోరాడి బిసి అధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు గట్టు మొగులయ్య, బిసి పొలిటికల్ జేఏసీ సమన్వయకర్త బంధారపు నరసయ్య, బొల్లమోని శంకరయ్య, ముదిరాజ్, సిలువేరు వెంకటేష్ శాలివాహన, జట్ట ముత్యాలు కురుమ, గట్టు లింగస్వామి ముదిరాజ్, నక్క శివ కుమార్ ముదిరాజ్, అన్నమోని వెంకటేష్ ముదిరాజ్, బొల్లమోని స్వామి, కందుల పరమేష్, సంపత్ కుమార్, రాచకొండ పురుషోత్తం, నాగరాజు పాల్గొన్నారు.

# తోకల వెంకన్న భవనం కూల్చివేత రాజకీయ కక్షసాధింపే



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మాజీ ఎంపిపి , మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్నకు చెందిన నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేయడం ముమ్మాటికి రాజకీయ కక్ష సాధింపుతోనే జరిగిందని మునుగోడు మాజీ ఎంఎల్ఎ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరు మున్సిపాలిటీకి తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో 50కోట్లు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టానని అన్నారు. చండూరు పట్టణంలో రాహదారి విస్తరణ వెడల్పు 100ఫీట్లు ఉండే విధంగా ప్రణాళికా తయారు చేశామన్నారు. కాని ఇప్పటి ఎంఎల్ఎ రోడ్డు వెడల్పు పనులకు ఎలాంటి డిపిఆర్ లేకుండా ఒక చోట 100 ఫీట్లు, మరోచోట 90ఫీట్లు , 80 ఫీట్లతో రోడ్డు వెడల్పు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇష్టానుసారం గా వ్యవహరిస్తూ ప్రజలను అయోమయానికి గూరిచేస్తూన్నారని అన్నారు. రోడ్డు నిర్మాణానికి భవనం ఎలాంటి ఆటంకం లేకున్నాకూడా మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నేత తోకల వెంకన్న భవనాన్ని సమాచారం ఇవ్వకుండ కూల్చివేయించడం ఎంఎల్ఎ రాజగోపాల్‌రెడ్డి పతనానికి నిదర్శనం అన్నారు. రాజగోపాల్ రెడ్డి అభివృద్ధి నిరోధకులు అని , నేను తెచ్చిన నిధులతో కూడా అభివృద్ధి చేయలేకపోతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి తోకల వెంకన్న రాలేదనే కక్షతోనే భవనాన్ని కూల్చివేశారని రాజగోపాల్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో చండూరు మాజీ జడ్‌పిటిసి కర్నాటి వెంకటేశం , చైటుప్పల్ మాజీ జడ్‌పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి , మాజీ ఎంపిపి, మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న , మాజీ ఎఎంసి చైర్మన్ గుర్రం వెంకట్‌రెడ్డి , మాజీ కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం , బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ , బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న పాల్గొన్నారు.

# క్రిస్టియన్లకు నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** నామినేటెడ్ పోస్టులలో క్రిస్టియన్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఉమ్మడి నల్గొండ జిల్లా క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేఖల భద్రాద్రి ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ తో పాటు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్టియన్లు కాంగ్రెస్ కు ఎల్లవేళలా అండగా ఉంటున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు అండగా ఉండి గెలిపించడంలో క్రియాశీలక పాత్ర పోషించడం జరిగిందని తెలిపారు.గత ప్రభుత్వంలో కూడా క్రిస్టియన్లకు ఎమ్మెల్సీతో పాటు పలు నామినేటెడ్ పోస్టులను ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు క్రిస్టియన్లకు ప్రాధాన్యత కల్పించి రెండు కార్పొరేషన్ పదవులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా జిల్లాలోని క్రైస్తవులకు సమాధులు చర్చిల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమాధులకు సంబంధించి స్థలం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని వివరించారు. ఇప్పటికైనా క్రిస్టియన్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీఎస్ క్రిస్టోఫర్, ఎస్పీ జయప్రకాష్, కట్ట మోజేష్ ఉన్నారు.

## పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** నూతనంగా మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన సిహెచ్ హనుమంతరెడ్డి బుధవారం తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డిని పటేల్ రమేష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలపి అభినందించారు.





# గోవును రక్షించిన సిబ్బంది

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** పట్టణంలోని బొట్టు గూడ ప్రాంతంలోని విటల్ హాస్పిటల్ పక్కన ఉన్న పాత బావిలో ఆవు పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు బుధవారం మున్సిపాలిటీ వారికి సమాచారం అందించారు.మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ వెంటనే స్పందించి సంఘటన స్థలానికి మున్సిపాలిటీ జెసిబిలు,కార్మికులను పంపించి ఆవును రక్షించడంలో ప్రత్యేక పాత్రను పోషించారు. వీరితో పాటు అగ్నిమాపక సిబ్బంది, వన్ టౌన్ పోలీసులు బావి వద్దకు చేరుకొని పది అడుగుల బావిలో ఉన్న ఆవును దాదాపు రెండు గంటల పైనే శ్రమించి సురక్షంగా ప్రాణాలతో బయటకు తీశారు. మనుషులనే కాదు నోరులేని జీవి ప్రాణాలు కాపాడినందుకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోవన్ టౌన్ సీఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద చికిత్సపై రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండల కేంద్రంలోని గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయుర్వేద చికిత్స పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్న గోపి ఆయుర్వేద చికిత్స యొక్క గొప్పతనం గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిర్రు బాల మల్లయ్య, భార్గవ రామారావు, కోటేశ్వరరావు, ఆకుల లక్ష్మి, పడాల చంద్రం, ఆకుల దేవయ్య, పెద్దాకుల బలరాం, కందుకూరి అమర్నాథ్, సిద్ధులు, మడిగే స్వప్న, సుంకరి కుమార్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 9న దేశవ్యాప్త సమ్మె

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో పోరాటం చేసి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాలకు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్గాల యూనియన్ రాష్ట్ర మహిళ కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిపి వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ఈశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి మంద యాదగిరి, సిల్వర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సందర్శన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం బిఆర్ఎస్‌వి మండల అధ్యక్షులు కొమ్మగళ్ళ దయాకర్ ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా, పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన, తరగతి గదులు, వంట గదులను వారు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో కోల పరశురాములు, బుచ్చిరాములు, సంపత్ రెడ్డి, నాగార్జున, మధు, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రభుత్వ విద్యాలయాలలో మౌలిక వసతులు కల్పించాలని బిఆర్ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బిఆర్ఎస్‌వి బడిబాట రాష్ట్ర కమిటి పిలుపు మేరకు బిఆర్ఎస్‌వి దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌వి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. దేవరకొండలోని మోడల్ స్కూల్ సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ బడ్జెట్‌ను 15 శాతం పెంచుతామని మేనిఫెస్టోలో చెప్పి ఏడు శాతం కు పరిమితం చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డికి రియల్‌ఎస్టేట్ మీదున్న ప్రేమ విద్యా వ్యవస్థపై లేదని అన్నారు. విద్యా సంవత్సరం మొదలైనా విద్యాశాఖ మీద రేవంత్‌రెడ్డి కనీసం సమీక్షచేయలేదని అన్నారు. విద్యార్థుల సమస్యలపై బిఆర్ఎస్‌వి పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం అని సమస్యలను పరిష్కరించే వరకు కూడా పోరాటం కొనసాగిస్తాం అని ఆయన తెలిపారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను కేసీఆర్ బలోపేతం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని , ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా ముఖ్యమంత్రి సందర్శించారా అని ఆయన అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్నారని, ఇప్పటివరకు దాదాపు 70శాతం మంది



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందలేదని, ఆహారం పరిశుభ్రంగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి మండల అధ్యక్షులు పాత్లావత్ లక్ష్మణ్, హరికృష్ణ, వెంకటేష్, మహేష్, హరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. గ్రామస్థాయి అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పద్మావతమ్మ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి గ్రామస్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు పడటం వల్ల మట్టి మిద్దెలు కుటుంబాలు సురక్షిత ప్రాంతానికి తరలించాలని వారు తెలిపారు. పరిశుభ్రత పరిసరాలు మంచినీటి వసతులు వేడి నీళ్లతో వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు. మండల విద్యాధికారి అశోక్ కుమార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రభుత్వ బడిలో చేర్పించే విధంగా గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని అక్షరాస్యత శాతం పెంచాలని కోరారు. ఏపీవో రాజు మాట్లాడుతూ వర్షాలు పడడం వల్ల మొక్కలు నాటేందుకు అనువుగా ఉంటుందని గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు హరితహారం కింద మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సరీలోని మొక్కలు ద్వారా విరివిరిగా మొక్కలు నాటాలని కాళీ ప్రదేశాలను రైతుల పొలాల్లో గట్లకు రోడ్ల వెంబడి పంచాయితీ పరిధిలో మొక్కలు నాటాలని తెలిపారు. విష జ్వరాలు ప్రభులే అవకాశం ఉన్నందున వేడి చేసి నీళ్లను తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆరోగ్యశాఖ వైద్యులు సునీత తెలిపారు. గ్రామాల్లోనూ స్తంభాలు గాలి ప్రభావం వల్ల ఒరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందించి విద్యుత్ స్తంబాలు వర్షాలు కురుస్తున్నప్పుడు ముట్టుకో కూడదని విద్యుత్ షార్ట్ సంభవించే అవకాశం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వ్యాపారస్తులు సహకరించాలి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సిమెంటు, స్టీల్, ఇసుక రవాణా మొదలగు వ్యాపారస్తులు సహకరించాలని ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దారు శ్యాంసుందర్ రెడ్డిలు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సిమెంటు, స్టీల్, ట్రాక్టర్ యజమానులు, తాపీ మేస్త్రీల యూనియన్లతో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని వారికి నిర్మాణం చేపట్టుకోవడానికి ఆర్థిక స్తోమత లేదు కాబట్టి ప్రభుత్వమిచ్చే రూ.ఐదు లక్షల వరకు మెటీరియల్ సప్లై చేయవలసిందిగా వ్యాపారస్తులను కోరారు. అంతేకాకుండా అవసరమైన చోట ఇసుక రవాణా చేసుకొనుటకు ప్రభుత్వపరంగా అనుమతులు ఇస్తామని ట్రాక్టర్ యజమానులు కూడా అధిక ధరలు తీసుకోవద్దని వారు కోరారు. ఎస్సై శ్రీనివాసరావు, తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు సన్నిబోయిన ప్రసాద్, ఆకుల రవీందర్, తాపీ మేస్త్రీలు వెంకట్రావు, స్టీల్ సిమెంట్ యజమానులు శ్రీనివాసరావు, బసవయ్య, పంచాయతీ కార్యదర్శులు సత్తిరెడ్డి పాల్గొన్నారు.

# పేదలకు కూడూ..గూడూ అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/హాలియా:** అర్హులైన పేదలకు కూడు గూడు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాకునూరు నారాయణ గౌడ్ లు అన్నారు. బుధవారం హాలియా మున్సిపాలిటీలోని అనుముల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది ఏళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క పేదవారికి గూడు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామంటూ నేల తరబడి కాలయాపన చేసింది తప్ప అర్హులైన ఏ ఒక్క పేదవారికి ఆ ఇల్లు దక్కలేదని ఆరోపించారు. కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోని పేద ప్రజలకి ప్రధానమైన కూడు గూడు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి,, మాజీ వైస్ చైర్‌పర్సన్ సలహాదారులు పిల్లి ఆంజనేయులు,మాజీ కౌన్సిలర్ ప్రసాద్ బాబు , తక్కెళ్లపల్లి సైదులు , మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాసులు , మాజీ ఎంపిటిసి చెరుపల్లి ముత్యాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోర్ల ఈదయ్య , కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు నకిరేకంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గంలోని మానవపాడు మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన బోయ నారాయణ కి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.25500 రూపాయల చెక్కును అందించడం జరిగింది. ఎమ్మెల్యే తో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.



# ఆర్‌టిఐ కమిషనర్‌ను కలిసిన గ్రామీణ వైద్యులు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ఆర్‌టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డిని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరెడ్డి అయోధ్య రెడ్డి గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి ఉన్నత పదవి వరకు వెళ్లడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి పాల్గొన్నారు.

# మెయింటెనెన్స్ బిల్లు ఇవ్వాలని మంత్రిని కలిసిన కాంట్రాక్టర్లు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** రోడ్డు భవన శాఖ మెంటెనెన్స్ బిల్స్ వెంటనే చెల్లించాలని బుధవారం నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మెయింటెనెన్స్ బిల్లు రావడం లేదని వెంటనే మెయింటెనెన్స్ బిల్ ఇప్పించి ఆదుకోవాలని మంత్రిని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి ఈనెల 12 లోపు బిల్స్ వచ్చే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంట్రాక్టర్లు సయ్యద్ జలీల్ పాషా, ఓర్సు ఇద్దయ్య, బొంత ఎల్లయ్య, కే లింగయ్య బుడుగు వెంకన్న, వి శ్రీనివాస్ ఉన్నారు.

# ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొనాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నేడు మండల కేంద్రంలో ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా హైదరాబాద్ రోడ్డులోని పాల కేంద్రం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించే ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నిమ్మ శేఖర్‌రెడ్డికి పరామర్శ

**ప్రజాపక్షం/ఆత్మకూరు (యం) :** మండలంలోని సర్వేపల్లి గ్రామానికి చెందిన నిమ్మ శేఖర్ రెడ్డి మాతృమూర్తి నిమ్మ సుశీల మృతి చెందగ మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**




ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే మార్గమని పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించుకుని ప్రజా పోరాటాలకు కార్యోన్ముఖులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెం రామన్నపేట పరిధిలోని 59, 60 డివిజన్ల మహాసభ బుధవారం రామన్నపేటలో జరిగింది. ఈ మహాసభలో సురేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగానే అనేక హక్కులు సాధించబడ్డాయని ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాల వెనుక కమ్యూనిస్టు పార్టీ నేతల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయన్నారు. నాడు భూ పంపిణీ కోసం కమ్యూనిస్టులు పోరాడితే ఇందిరా గాంధీ భూ సంస్కరణల చట్టాన్ని తీసుకు వచ్చిందని బ్యాంకుల జాతీయకరణ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని సురేష్ తెలిపారు. 21వ శతాబ్దంలో అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం సహా పలు చట్టాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఏర్పడ్డాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటం లేనిది కార్మికులకు హక్కులు కానీ పేద, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు కానీ అమలు కాలేదన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ తన మహత్తర పోరాటాలతో అనేక హక్కులు సాధించిందని ప్రజా పోరాటాల క్రమంలో నూరేళ్లు పూర్తి చేసుకుందన్నారు. శత వసంత సభలతో భారత కమ్యూనిస్టు పార్టీ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోబోతుందన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, అజ్మీర రామ్మూర్తి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, సీనియర్ నాయకులు బోజడ్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభకు పీట్ల కృష్ణమూర్తి, గుగులోత్ శ్రీనివాస్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

# జెఎన్‌టియు విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి


**-భవనాలను సత్వరం పూర్తి చేయండి**
**-పొంగులేటికి ఏఐఎస్ఎఫ్ వినతి**



ప్రజాపక్షం/ ఖమ్మం : జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వెంటనే పూర్తి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలోని మద్దులపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇదే సమయంలో రెగ్యులర్ ఫ్యాకల్టీ, ల్యాబ్, గ్రంథాలయాలు లేవని రామకృష్ణ తెలిపారు. రెండేళ్ల క్రితం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందని ఐటిడిఏ స్టడీ సర్కిల్ భవనాన్ని కళాశాలకు కేటాయించడం జరిగిందని అందులో ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు. సాంకేతిక రంగానికి సంబంధించిన విద్య కావడంతో తప్పనిసరిగా వసతులు సమకూర్చాలని రామకృష్ణ కోరారు. తరగతి గదుల సమస్య కూడా వెంటాడుతుందని చిన్న భవనంలో వందల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ నాయక్, మనోజ్, వంశీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ బ్యాంకుల ఆకస్మిక తనిఖీ

**-నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు**
**డిఎంహెచ్ఓ బి కళావతిబాయి**





ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని శివబ్లడ్ బ్యాంక్, సిరి బ్లడ్ బ్యాంక్, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌తో పాటు మమత మెడికల్ కాలేజ్ బ్లడ్ బ్యాంకులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి కళావతిబాయి బుధవారం తమ బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీకి చేపట్టారు. నిర్వాహకులకు చెక్ లిస్ట్ ప్రకారం బ్లడ్ బ్యాంకు నిర్వహణ గురించి తెలిపారు. మౌళిక వసతుల నిర్వహణ, భవన పరిశుభ్రంగా ఉండి సక్రమంగా వెలుతురు కలిగి ఉండాలని రక్త సేకరణలో పరీక్షలు, రక్త నిల్వ, దాతల విశ్రాంతి ఏర్పాట్లు, చేతుల శుభ్రంగా పరుచుకోవడానికి నీటి నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాలను డిస్పోస్ విధానం, లైసెన్సు, చట్టబద్ధమైన డ్రగ్ కంట్రోల్ లైసెన్సు(ఫారం 28సి లేదా 28ఈ) కనపడేవిధంగా లైసెన్సులను రిసెప్షన్ కౌంటర్‌లో ఉంచాలని సూచించారు. రక్తదాతల నమోదుల అంగీకార పత్రాలను తీసుకోవాలని తెలిపారు. రక్త సేకరణ, పరీక్ష, రక్త నిల్వ మరియు రక్త ఎవరికి జారీ చేశారో వివరాలను జాగ్రత్త పరచాలని తెలిపారు. రక్తనిల్వ 2 డిగ్రీల సెల్సియస్ నుండి 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ఉండాలని, ఉష్ణోగ్రత మానిటరింగ్ మరియు అలారం వ్యవస్థ ఉండాలని, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ పూర్తి రక్తం కోసం వేరు వేరుగా నిల్వ చేసే ప్రాంతాల ఏర్పాటు ఉండాలని మంచి కండిషన్‌లో ఉన్న రక్త బ్యాంకు ఫ్రిజ్, సెంట్రిఫ్యూజ్, హిమోగ్లోబిన్ మీటరు ఉండాలని అవసరమైన స్థాయిలో వైద్య పరికరాలు ఉంచుకోవాలని, బ్లడ్ బ్యాంకు మ్యానువల్ అనుగుణంగా శిక్షణ పొందిన వైద్యులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలని, వ్యర్థాల నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాలు సక్రమంగా వేరుచేసి నిర్వహించాలని, రిజిష్టర్లు, రికార్డులు 5 సంవత్సరాలు వరకు తప్పనిసరిగా భద్రపరచాలని, ప్రజలకు న్యాయమైన సేవలు అందించాలని, ప్రజల నుంచి కంప్లెయింట్స్ వస్తే ఎంక్వయిరీ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని నిరంతరం మానిటరింగ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి కళావతిబాయి బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులను హెచ్చరించారు. బ్లడ్ బ్యాంకులను తనిఖీ చేసిన వారిలో డిఎంఅండ్‌హెచ్ఓ కళావతిబాయితో పాటు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సైదులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

# వీడిన ఉత్కంఠ..!

**-వెలువడిన తుది జాబితా**
**-కల్లూరు మున్సిపాలిటీ వార్డుల ప్రక్రియ పూర్తి**



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు నూతన మున్సిపాలిటీ 20 వార్డులుగా విభజించి ఆమోదం జరిగినట్లు మున్సిపాలిటీ ఇన్చార్జి కమిషనర్ అరిగల సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, రాబో యే రోజుల్లో ఇదే విధంగా మున్సి పాలిటీ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కల్లూరు లోని పురపాలక సంఘం కార్యాల యంలో బుధవారం ఆయన ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో వార్డులో 954 ఓటర్ల నుంచి లోపు ఉన్నా రని, సరిహద్దులు కూడా నిర్ణయించడం జరిగిందని వారు పేర్కొన్నారు. అభ్యర్థనలు సలహాలు, సూచనలు మేరకు ఈ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. మున్సిపాలిటీ మ్యాప్ కూడా తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఓపెన్ ప్లాట్స్ వారికి నోటీసులు జారీ చేసి ప్రత్యేక పారిశు ద్ధ్య కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఉన్న గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ప్రజలకు అవగాహన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపాలిటీ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఎఐవైఎఫ్ నేతల అరెస్టు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్న ట్రంప్ వ్యవహార తీరును నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య హైదరాబాద్‌లోని అమెరికన్ రాయబారి కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లానుంచి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న అనేక మంది కార్యకర్తలను పోలీసులు నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఏఐవైఎఫ్ రాష్ట్రనాయకులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, శ్రావణ్, వెంపటి సురేందర్, వీరభద్రం సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నేతలు మాట్లాడుతూ అరెస్టులతో ఆందోళనను ఆపలేరని అమెరికా తన వైఖరిని మార్చుకునేంత వరకు ఏదో ఒక రూపంలో ఆందోళన కొనసాగుతూనే ఉంటుందన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ఏన్కూరు : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు కోరారు. మండల పరిధిలోని జన్నారం ,ఆరికాయలపాడు గ్రామాల మధ్యలో గల నిమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహసిల్దార్ శేషగిరిరావు, ఎస్సై ఉఫాతుల్ రఫీ, ఎంపీడీవో జీవీఎస్ నారాయణ పరిశీలించారు. ఆ వాగు వైపు వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డుగా పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపల్లెవాడ, జన్నారం, నాచారం వాగుల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. గత నాలుగు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగుల వద్దకు పిల్లలను ఈత కొట్టేందుకు వెళ్ళనివ్వద్దని తల్లిదండ్రులకు సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వాగులు, చెరువుల వద్దకు వెళ్ళరాదని వారు కోరారు. రేపల్లెవాడ వాగులో చెత్తాచెదారం ఆగి ఉండటంతో జెసిబి సహాయంతో చెత్తను తొలగించి నీళ్లు వెళ్లే విధంగా చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, పోలీస్ సిబ్బంది రవి ఉన్నారు.

# సింగభూపాలెం చెరువుకు జలకళ



ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 12 అడుగుల నీరు చేరింది. చెరువు ఆయకట్టు 2,00,400 ఎకరాలలో రైతులు పంట సాగు చేస్తారు. చెరువు మీద ఆధారపడి ప్రధాన పంటగా వరి సాగు చేస్తున్నారు. దానితోపాటు మొక్కజొన్న, కూరగాయలు, పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే కొంతమంది రైతులు తమ వరి నారుమళ్ళు సిద్ధం చేసుకుని వరి నాట్లు వేస్తున్నారు. ఎడమ, కుడి కాలువ ద్వారా సింగభూపాలెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం , రూప్ల తండా, నరసింహసాగర్, సుజాతనగర్, మంగపేట, గొల్లగూడెం, నాయకులగూడెం, దేగలమడుగు గ్రామాల రైతులు చెరువు నీటి ద్వారా కాలువలు బోర్ల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు ఏదాది సమృద్ధిగా రావడంతో చెరువుకు అలుగు పారుతుందని, తమ యాసంగి పంటలకు నీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆనందంలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు ఆనందంలో ఉన్నారు. మండల పరిధిలోని లోకవరం, కల్లూరు, చెన్నూరు, పెద్ద కోరుకొండి, వెన్నవల్లి, చిన్న కోరుకోండి, పేరు వంచ, బత్తులపల్లి, చండ్రు పట్ల తదితర గ్రామాలలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు 746 మంది కి మంజూరు కాగా 724 మందికి పట్టాలు అందించడం జరిగిందని, 509 మంది ముగ్గు పోసుకున్నారని, 156 మంది బేస్మెట్ స్థాయిలో ఉన్నారని, 9 మంది స్లాబ్ స్థాయిలో నిర్మించారని రెండు గృహాలు పూర్తయినట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ పేర్కొన్నారు. త్వరలో గృహాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులతో అవగాహన సదస్సులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి సోమవారం పలు దశల్లో ఉన్న గృహాలను గృహాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాలలో లబ్ధిదారులు సంతోషంగా ఉల్లాసంగా గృహ నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేకంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన లోకవరం లో 57 గృహాలు మంజూరు కాగా పలు దశల్లో ఉన్నాయని 9 గృహాలు స్లాబ్ స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. వారు సంతోషంగా ఈ నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ తో పాటు, ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీలు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాలలో లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానందక్‌కు రుణపడి ఉంటామని వారు వివరిస్తున్నారు.